# వడ్లగింజలో బియ్యపుగింజ

'శారదా!'
'.........'
'శారదా!!'
'.........'
'ఏయ్! శారదా!!...'
(వంటయింట్లోంచి) 'ఏందుకండీ?'
'ఎందుకా? ఇంకా పక్కింట్లో కూర్చొని అడుగు ఎందుకని.'
'ఏమొచ్చి పడిందండీ, అలా అరుస్తారు?'
'ఈ స్టాండుకు తగిలించిన తెల్లచొక్కా ఎక్కడ?'

> "మహారాజులా పో, టిక్కెట్టు కూడా కొనిస్తాను. నేనొక్కణ్ణే హాయిగా వుండొచ్చు"

'ఏమో నాకేం తెలుసు?'
'నీకు తెలియకండా ఏమౌతుంది?'
'మరే! నేను తొడుక్కున్నాను!!'
'సరేలే! అడిగిందానికి బదులు చెప్పు. ఎక్కడ ఆ చొక్కా? కాళ్ళొచ్చి పరిగెత్తిందా?'
'లేదు, రెక్కలొచ్చి యెగిరి వెళ్ళింది.'
'నోర్ముయ్! అధిక ప్రసంగం మాని.'
(స్టాండుకు తగిలించివున్న మరో మాసిన చొక్కా ఆమె ముఖమ్మీద విసిరికొట్టాడు.)
'నిన్న స్టాండుకుతగిలించిన చొక్కా ఈ రోజు కనపడదు. నువ్వు యింట్లో కూర్చొని యేం చేస్తున్నట్టు?'
'మీ చొక్కాలు పంచల సంగతి నాకేం తెలుసునండి?'
'నీకు తెలియకండా అది ఎక్కడకు పోతుంది? ఎట్లా పోతుంది? ఊఁ నువ్వున్నచోట ఏదీ సవ్యంగా వుంటుందీ కనక.'



(కళ్ళంబట నీళ్లు రాగా) 'ఔను. నేనున్నచోట ఏదీ సవ్యంగా వుండదు. నేను పోతాలెండి ఎక్కడికైనా మీ కంటికి కనపడకండా.'

'మహారాజులాపో, టిక్కెట్టుకుడా కొనిస్తాను. నేనొక్కణ్ణే హాయిగా వుండొచ్చు.'

'హాయిగా అన్నా వుండండి, ఎలాగావాలన్నా వుండండి. ఒక చొక్కా కనపడనందుకు నామీద ఇలా ఎగిరిపడేవాళ్లతో వుండేం ప్రయోజనం? మా అమ్మగారి యింటికెళ్లి హాయిగా వుంటాను.'

'ఆహా, నిక్షేపంలాపో, ఈ సాయంత్రం బండికే వెళ్లు, ఇకనైనా ఈ కొంపలో పెట్టిన సామాను పెట్టినచోట వుంటుంది. నేనూ హాయిగా ఏ సినిమాకో నాటకా

శ్రీ నాగరాజు సాంబశివన్

నికో పోతూ హోటల్లో భోంచేస్తూ సుఖంగా వుంటాను.'

* * * *

## 2

ప్రియమైన భర్తగార్కి,

శారద అనేక నమస్కారములు. ఇక్కడ అమ్మ, నాన, తమ్ముడు-అందరు క్షేమం-అక్కడ మీరు క్షేమమని తలచెదను.

ఒక చిన్న విషయంకోసం మీపైన కోపించి ఇక్కడికి వచ్చినందుకు మనస్సు ఎంతో కష్టపడింది. అక్కడ మీరు యింటి భోజనంలేక హోటల్లో ఏంబాధ పడుతున్నారోనని తలచుకొన్న కొద్దీ ఎప్పుడు బయల్దేరి వచ్చేద్దామా అని వున్నది.

వచ్చేనెల మా తమ్ముడికి వొడుగు అంతవరకు నన్ను వుండమని పట్టుపడుతున్నారు. నాకు యిక్కడ నిలవుండేందుకు ఎంతమాత్రం యిష్టంలేదు. ఈనెలా ఎలాగో గడిపి వెంటనే వచ్చేదను.

అనేక నమస్కారములు.
తప్పులు క్షమించవలెను.

ఇట్లు
ఎల్లపుడు మిమ్మలనే స్మరించు
శారద.

* * * *

ప్రియమైన శారదకు.

అనేక ఆశీర్వాదములు. నీ వుత్తరం చూచినవెనుక నా మనస్సుకు చాల కష్టం తోచింది.

ఒక చిన్న విషయంలో నీమీద అనవసరంగా కోపించినందుకు బాధపడుతున్నాను.

ఇంతకీ అసలు ఆ తెల్లచొక్కా తర్వాత ఎక్కడ కనిపించిందో తెలుసా ? మనం వాదించుకుని పోట్లాడుతున్నప్పుడు నేను తొడుక్కొని వున్నది ఆచొక్కాయే!

పొద్దున్న ఆఫీసుకు వెళ్ళే అవసరంలో ఏచొక్కా అనేది గమనించకండా తొడుక్కొని దానిమీద కోటుకుడా వేసుకోవటంవల్ల ఆ చొక్కా తొడుక్కొన్న సంగతి జ్ఞాపకం లేకపోయింది. వడ్లగింజలో బియ్యపుగింజ అన్నట్లు ఇంత చిన్న విషయంలో నీ మనస్సు వృథాగా కష్టపెట్టి నందుకు నాకు చాల విచారంగా వుంది.

హోటలు భోజనం ఏమీ సనిగాలేదు. మీ తమ్ముడి వొడుగు అయిన వెంటనే బయల్దేరి రాగలవు. అంతవరకూ ఎట్లాగో గడుపుకుంటాను.

నీవాడు.
రఘునాథరావు.

## 3

రెండు నెలల తర్వాత శారద భర్తయింటికి వచ్చింది.

ఒకరోజు రఘునాథరావు ఆఫీసుకు వెళ్ళే తొందర్లో-

'శారదా!'

'ఏమిటీ ?'

'ఈ డ్రాయర్లో పెట్టిన పెన్ను ఏమైంది ?'

'ఏమో! మీ పెన్నుసంగతి నాకేం తెలుసు ?"

'నీకు తెలీయదా! నిన్న రాత్రి మీ యింటికి జాబు వ్రాశావా లేదా? నా పెన్ను తియ్యకే అని ఎన్నిసార్లు చెప్పినా నువ్వు వింటేగా. మీయింటికి జాబు వ్రాయటానికి నాపెన్నే దొరకాలా నీకు ?"

'ఇదుగో, నేను యింటికి జాబు వ్రాసుకోటం మీ కిష్టం లేకపోతే స్పష్టంగా చెప్పేయండి. అంతేకాని......'

(కళ్లు చెమ్మగిల్లాయి.)

'సరే మొదలెట్టావా ? చాలు. పెన్ను పెట్టిన చోట వుండదు. పుస్తకం పెట్టిన చోట ఉండదు. నువ్వున్న చోట ఏది సవ్యంగా వుంటుంది కనక.'

'అవును నేను వుండే చోట ఏదీ సవ్యంగా వుండదు. ఎక్కడికైనా మీ కగపించని చోటు చూసి...'

'శీఘ్రంగా వెళ్లు. ఈ క్షణమే వెళ్ళు. తర్వాతైనా యీ కొంపలో పెట్టిన సామాను పెట్టినచోట వుంటుంది...' ★



నిరంతర సహవాసి

మీరు మకాం చేస్తున్నా, లేక ఇంటిలోనే ఉన్నా, ఇటియాల్ మీకు నిరంతర సహవాసిగా ఉంటుంది. దానిని నమ్మకంగా మీరు వాడవచ్చును.

సెప్టిక్ కానివ్వదు, క్రిమివిధ్వంసిని, ఆహ్లాదకరమైనది, విషంకాదు.

I·T·L




ఉత్పత్తిదారులు:
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిడ్.
మల్లేశ్వరం, బెంగుళూరు.

సెల్లింగ్ ఏజెంట్లు:
బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్,
పోస్ట్ బాక్స నం. 63, మద్రాసు.

BZ-35 T6